# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 145 గుంటూరు, బుధవారం 04- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.


సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# టీటీడీ కల్తీ నెయ్యి కేసు...
# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 3: తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదం నెయ్యిలో రసాయనాల మిశ్రమంపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. సిట్ నివేదికలోని లోపాలను సరిచేసి, అసలు సూత్రధారులను కనుగొనేందుకు కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. అప్పట్లో పర్చేస్ కమిటీకి సభ్యులు కాని భూమన కరుణాకర్ రెడ్డిని ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలిచారని సీఎం చంద్రబాబుకు మంత్రులు వివరించారు. అయితే, ఆనాడు కమిటీ సభ్యులుగా ఉన్న తనను, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని పిలవలేదని మంత్రి పార్థసారథి చెప్పారు. రసాయనాల మిశ్రమం కలిసిన లడ్డూలను అయోధ్యకు కూడా పంపారని కేబినెట్‌లో అధికారులు పేర్కొన్నారు. నెయ్యి టెండర్ నిబంధనలను మార్చడంపైనా మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్ దక్కించుకున్నారని, టెండర్ నిబంధనలను మార్చినప్పటికీ ఈఓగా ఉన్న సింఘాల్ అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంపై పలువురు మంత్రులు ప్రశ్నలు లేవనెత్తారు. 2022లో సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలో నెయ్యి కల్తీ జరిగిందని నివేదిక వచ్చినా పట్టించుకోకపోవడంపై చర్చించారు. అప్పటి అధికారులు బాలాజీ, సుబ్రహ్మణ్యం దానిని పక్కన పెట్టారని నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌డీడీబీ నివేదికలో యానిమల్ ఫ్యాట్ ఉందని తేలిందని, అదే విషయాన్ని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రులు తెలిపారు. సిట్ నివేదికలో కొంతమంది పేర్లు పేర్కొన్నప్పటికీ, చివరి ఫైండింగ్స్‌లో వాటిని పేర్కొనకపోవడంపై చర్చ జరిగింది. ఈ లోపాలన్నింటిపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదికను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించింది. టెండర్ ప్రక్రియలో లోపాలపై దృష్టి సారించాలని కమిటీకి మంత్రిమండలి సూచించింది. సహకార డెయిరీలను పక్కన పెట్టేందుకు పథకం రూపొందించారని కేబినెట్ పేర్కొంది. సహకార డెయిరీలను పక్కన పెట్టడం ద్వారా బోగస్ డెయిరీలను రంగంలోకి తీసుకువచ్చారని అధికారులు వివరించారు. దీనిపైనా ఎంక్వైరీ కమిటీ దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. అడ్వకేట్ జనరల్, సీనియర్ అధికారుల అభిప్రాయాలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అప్పటి చైర్మన్ సుబ్బారెడ్డి పాత్ర గురించి సిట్ నివేదికలో ఏమైనా పేర్కొన్నారా? అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఛార్జ్‌షీట్‌లో యానిమల్ ఫ్యాట్ ఉందని పేర్కొన్నారా? అని కూడా పవన్ అడిగారు. ఛార్జ్‌షీట్‌లోని 35వ పేజీలో స్పష్టంగా పేర్కొన్నారని పవన్‌కు చెప్పారు అధికారులు. అసలు సూత్రధారులను వెంటనే తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. సిట్ నివేదికలో లోపాలు ఉన్నాయని, అసలు సూత్రధారులను బయటకు తీసుకురాలేకపోయిందని మంత్రులు పేర్కొన్నారు. అందువల్ల వెంటనే అసలు సూత్రధారులపై ఫోకస్ పెట్టాలని మంత్రులు చెప్పారు. ఈ విషయాలను బహిర్గతం చేసేందుకే కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే ఎవరిపై చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా మారనుంది

**ఫిబ్రవరి 03 క్రైమ్ కౌంటర్ న్యూస్):** భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ఈ ఒప్పందం వల్ల దేశ ఎగుమతి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా యువతకు, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.



## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం:

**ఫిబ్రవరి 03 క్రైమ్ కౌంటర్ న్యూస్):** అమెరికా తో కుదుర్చుకోబోయే కొత్త వాణిజ్య ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపిరి పోయనుంది. ఈ డీల్ వల్ల ప్రధానంగా ఎగుమతులు భారీగా పెరిగే అవకాశం ఉండటంతో, దేశంలోని టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్, మరియు జెమ్స్-జువెలరీ వంటి కీలక రంగాల్లో కొత్త ఉత్తేజం కనిపిస్తోంది. ఈ రంగాలు విస్తరించడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కేవలం మెట్రో నగరాల్లోనే కాకుండా, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో కూడా ఉపాధి పెరగడం వల్ల సామాన్యుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడనున్నాయి.

మరోవైపు, ఈ ఒప్పందం వల్ల ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చే అవకాశం ఉంది. అమెరికా నుండి దిగుమతి చేసుకునే ముడి చమురు, సహజ వాయువు (+ుం) తక్కువ ధరకే లభిస్తే, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టే ఛాన్స్ ఉంది. ఇంధన ధరలు తగ్గడం వల్ల రవాణా ఖర్చులు తగ్గి, నిత్యావసర వస్తువుల ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులోకి వస్తాయి. తద్వారా మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై భారం తగ్గి, వారి జీవన ప్రమాణాలు పెరిగేందుకు ఈ డీల్ దోహదపడుతుంది. ద్రవ్యోల్బణం నియంత్రణలో కూడా ఈ ట్రేడ్ డీల్ కీలక పాత్ర పోషించనుంది. అమెరికాతో వాణిజ్యం పెరగడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో

2 లో

### ఏపీ అభివృద్ధి లక్ష్యంగా ఢిల్లీకి మంత్రి నారా లోకేశ్:
## కేంద్ర మంత్రులతో కీలక భేటీలు!



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 03** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరులు, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు దేశ రాజధాని ఢిల్లీకి పయనం కానున్నారు. అమరావతిలో జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఆయన తన పర్యటనను ప్రారంభించనున్నారు. షెడ్యూల్ ప్రకారం, మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టుల సాధన దిశగా ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీ చేరుకున్న అనంతరం, రేపు ఉదయం లోకేశ్ పార్లమెంట్ భవనానికి వెళ్లి అక్కడ పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలవనున్నారు. రాష్ట్రంలోని విద్యారంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలు, ఐటీ రంగ విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ఆయన కేంద్రానికి వివరించే అవకాశం ఉంది. అలాగే ఏపీలో నిరుద్యోగితను తగ్గించేందుకు అవసరమైన కేంద్ర సహకారాన్ని కోరనున్నారు. ఈ భేటీలలో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా చర్చలు సాగనున్నాయి. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న కేంద్ర పథకాల అమలుపై కూడా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా ఐటీ హబ్‌ల ఏర్పాటు మరియు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతానికి కేంద్ర మంత్రుల నుంచి సానుకూల హామీలను పొందే ప్రయత్నం చేయనున్నారు. కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలను కేంద్రానికి వివరించి, పెట్టుబడుల ఆకర్షణలో కేంద్రం తోడ్పాటును ఆయన కోరనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన ద్వారా రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు ముగించుకున్న అనంతరం, రేపు అర్ధరాత్రికి మంత్రి నారా లోకేశ్ తిరిగి ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. పర్యటన వివరాలను మరియు కేంద్రం నుంచి లభించిన స్పందనను ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నివేదించే అవకాశం ఉంది. కేవలం రెండు రోజుల వ్యవధిలో జరుగుతున్న ఈ మెరుపు పర్యటనతో రాష్ట్ర రాజకీయాల్లో మరియు పాలనలో కీలక మార్పులు వస్తాయని ఆశిస్తున్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికే ఈ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.



### రేట్లు పెంచి అమ్మితే
## ఊరుకునేది లేదు.

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 03** ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ అమ్మకాల విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. ఈ మేరకు లిక్కర్ షాప్ యజమానులకు ఆయన వార్నింగ్ ఇచ్చారు. అధిక ధరలకు మద్యం విక్రయించడం నిబంధనలకు విరుద్ధం.. మద్యం దుకాణదారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు అంటూ.. పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. లిక్కర్ షాపుల్లో మద్యం బాటిళ్లు వీ:లా కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు అందిందని.. ఇకనైనా జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరించారు. కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని.. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు.. ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు

2 లో

## నెయ్యి కల్తీపై మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తు:

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03,** వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం (ఙఐ) పవిత్రతను దెబ్బతీసేలా విచ్చలవిడిగా నిర్ణయాలు తీసుకున్నారని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలు లేకుండానే కల్తీ నెయ్యిని తయారు చేసేలా నిబంధనలను మార్చి వైసీపీ నేతలు బరితెగించారని ఆయన ఆరోపించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యి నాణ్యత విషయంలో అడ్డగోలుగా వ్యవహరించి, హిందువుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వర స్వామి ప్రసాదం విషయంలో అపచారం చేశారని ఆయన ధ్వజమెత్తారు.



2 లో

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం:

రూపాయి విలువ బలపడే అవకాశం ఉంది, ఇది దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలను తగ్గిస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లు, లాప్‌టాప్ లు మరియు ఇతర విదేశీ గ్యాడ్జెట్లు తక్కువ ధరకు లభించడం వల్ల విద్యార్థులకు, నిపుణులకు ఎంతో మేలు జరుగుతుంది. రూపాయి బలోపేతం కావడం వల్ల విదేశీ విద్య మరియు ప్రయాణాలు కూడా సామాన్యులకు మరింత భారంగా అనిపించవు.

అయితే, ఈ ఒప్పందంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ఇంకా పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉంది. భారత రైతుల ప్రయోజనాలను కాపాడుతూనే, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు మన మార్కెట్‌లో ఎంతవరకు చోటు కల్పిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ వ్యవసాయ ఎగుమతులకు సానుకూల నిర్ణయాలు వస్తే, భారతీయ రైతులు కూడా అంతర్జాతీయ మార్కెట్ ధరలను పొందే అవకాశం ఉంటుంది. మొత్తానికి, కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, ఈ వాణిజ్య ఒప్పందం భారత సామాన్యుడికి ఆర్థిక స్థిరత్వాన్ని, మెరుగైన భవిష్యత్తును అందిస్తుందని ఆశించవచ్చు.

## రేట్లు పెంచి అమ్మితే ఊరుకునేది లేదు.

మద్యం దుకాణాలపై నిఘా పెట్టి.. అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో పవన్ కల్యాణ్ స్పందించడం చర్చనీయాంశంగా మారింది.

చర్యలు తీసుకోండి..

ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ఇలా పోస్ట్ చేశారు. "రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో ఎం.ఆర్.పి కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఫిర్యాదు అందింది. కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 'అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్దం. అది ప్రభుత్వానికి చెడ్డ పేరు కూడా తెస్తుంది. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని.." స్పష్టం చేశారు. సంబంధిత శాఖ అధికారులు మద్యం దుకాణాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు.

## నెయ్యి కల్తీపై మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తు:

టీటీడీ నెయ్యి కల్తీ జరిగిందని తాము అంటుంటే, అందులో జంతు కొవ్వు కలవలేదని వైసీపీ నేతలు చేస్తున్న వాదనలు విడ్డూరంగా ఉన్నాయని మంత్రి ఎద్దేవా చేశారు. జంతు కొవ్వు కలవలేదని చెబుతున్న వైసీపీ నేతలు, కనీసం కల్తీ జరిగిందని పరోక్షంగా ఒప్పుకుంటున్నారని ఆయన విశ్లేషించారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే నెయ్యి కల్తీ అయిందని  నివేదికలు స్పష్టం చేసినప్పటికీ, నాటి పాలకులు ఆ హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోకుండా భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని ఆయన విమర్శించారు.

నెయ్యి సరఫరా కాంట్రాక్టుల విషయంలో జరిగిన అవకతవకలపై సత్యకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పదంగా మారిన భోలేబాబా డెయిరీని తెరపైకి తెచ్చిన ఆ 'ఆలీబాబా' ఎవరో త్వరలోనే తేలాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు ఈ కల్తీ మాఫియా వెనుక ఉన్నారని, వీరందరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

కేవలం నెయ్యి కల్తీతోనే ఆగకుండా, టీటీడీ వంటి అత్యున్నత ధార్మిక సంస్థలో అన్యమతస్థులను నియమించి జగన్ మోహన్ రెడ్డి పవిత్రతను మంటగలిపారని మంత్రి విమర్శించారు. స్వామివారి సేవలో హిందూయేతరులను చేర్చుకోవడం ద్వారా ఆలయ సంప్రదాయాలను తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన ప్రతి అక్రమంపై పూర్తిస్థాయి విచారణ జరుగుతుందని, బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదని మంత్రి సత్యకుమార్ హెచ్చరించారు.

## లక్ష్మీనారాయణ రెడ్డి వర్ధంతి. అన్నదానం




బిక్కవోలు క్రైం కౌంటర్ ఫిబ్రవరి 3 తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం సినిమా హాలు కోలని కోనాలా భూపా రెడ్డి కుమారుడు స్వర్గీయ లక్ష్మీ నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ రోజు మంగళవారం కె అర్ కె సంక్షేమ చారిటి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు మూడు పూటలా అన్నదానం జరిపించి వారి ఆకలి తీర్చారు. ఈ అన్నదానం లో పాల్గొని ఆకలి తీర్చుకొన్న వృద్ధులు అన్నదాత సుఖీభవ అని స్వర్గీయ లక్ష్మీ నారాయణ రెడ్డి ఆత్మ శాంతి కోసం ప్రార్ధన చేశారు. చెట్టుకు కాసిన పిందిలే రాలిపోతుంటే ఆ చెట్టు ఆవేదన బాధ చెప్పలేము. కడుపున బిడ్డలు కళ్ళ ఎదుటే కాలం చేస్తుంటే ఆ తండ్రి వేదన భరించలేనిది.ఎంతో గారంగా పెంచుకున్న కుమారుడి జ్ఞాపకాలను తలచుకొంటూ భూపా రెడ్డి తీవ్ర ఆవేదనకు గురి అయ్యారు. తన కుమారుడి ని తలచుకొంటూ అయన ఈ అన్నదానం నిర్వహించారు కుమారుడి జ్ఞాపకార్థం భూపా రెడ్డి ప్రతీ సంవత్సరం ఈ రోజు తప్పకుండా ఈ అన్నదానం నిర్వహించడం వల్ల ఎందరికో ఆకలి తీరుతుందని ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కర్రి రామ కృష్ణా రెడ్డి తెలుపుతూ స్వర్గీయ లక్ష్మీ నారాయణ రెడ్డి ఆత్మ శాంతి కోరుతూ శ్రద్ధాంజలి ఘటించి నివాళు లు అర్పించారు.

## పెద్దకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వంద రోజులు 100 గ్రామాలు కార్యక్రమం

క్రోసూరు క్రైమ్ కౌంటర్ పోతుగంటి నాగేశ్వరరావు  క్రోసూరు మండలం పెరికపాడులో ఉన్నా రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారు ఆదేశించారు. 36వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని క్రోసూరు మండలం పెరికపాడులో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ఇప్పటి వరకు 57 లక్షల రూపాయలను ప్రభుత్వం నిధులను ఖర్చు చేసిందన్నారు. అనంతరం గ్రామస్థులతో కలిసి భోజనం చేశారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు,విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గ్రామంలోని కార్యకర్తల ఇళ్లలో జరిగిన కార్యక్రమాల నేపథ్యం వారి ఇంటికి



వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య తలెత్తినా వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అమరావతి మండల పార్టీ అధ్యక్షులు,ఎమ్మార్వో,ఎంపిడిఓ,మండల,గ్రామ అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 36వ రోజు ప్రజల వద్దకు ఎమ్మెల్యే ప్రవీణ్





క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు కోసూరు న్యూస్ : క్రోసూరు మండలం పెరికపాడులో జరిగిన " ప్రజల వద్దకు ప్రవీణ్ : 100 రోజులు 100 గ్రామాలు" పర్యటన కార్యక్రమంలో పాల్గొన్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 36వ రోజు ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా విని పరిష్కార చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే. అనంతరం గ్రామ సమస్యల పై స్థానిక నాయకులతో చర్చించిన ఎమ్మెల్యే. గ్రామంలో తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్న ఎమ్మెల్యే. త్వరితగతిన పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి నిర్ణీత సమయంలో ఇతర సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర సీనియర్ నాయకులు వెన్న సాంబశివరెడ్డి ఎమ్మార్వో నాగరాజు, ఎండిఓ జి. రవికుమార్ , మండల పార్టీ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## తిరుమల పవిత్రతను కాపాడి తీరుతాం.



క్రైం కౌంటర్ న్యూస్ : అమరావతి, ఫిబ్రవరి 3: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.రాజకీయ కోణం లేదు.. భక్తుల మనోభావాలే ముఖ్యం

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

ప్రభుత్వానికి జనసేన పూర్తి మద్దతు

శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని ఆయన చంద్రబాబుకు స్పష్టం చేశారు. పవిత్రమైన ఆలయ ప్రాభవాన్ని దెబ్బతీసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

ఐక్యంగా వైసీపీ కుట్రలను తిప్పికొడదాం: సత్యకుమార్ యాదవ్

బీజేపీ తరపున మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ విషయంలో కూటమిలో పూర్తి ఏకాభిప్రాయం ఉందని తెలిపారు. వైసీపీ హయాంలో జరిగిన ఈ కుట్రలను ప్రజల ముందు పెట్టి, క్షేత్రస్థాయిలో వారిని ఎండగట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు.

సమావేశంలో పాల్గొన్న కీలక నేతలు:

ఈ కీలక భేటీలో కూటమిలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.. వీరిలో..

నారా చంద్రబాబు నాయుడు (ముఖ్యమంత్రి)

పవన్ కల్యాణ్ (ఉప ముఖ్యమంత్రి)

నాదెండ్ల మనోహర్(పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి)

నారా లోకేష్(మానవ వనరుల అభివృద్ధి, పాఠశాల విద్య, ఉన్నత విద్య, ఐటీ (x), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి)

పయ్యావుల కేశవ్(ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి) సత్యకుమార్ యాదవ్(ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి) తిరుమల ఆలయ పవిత్రత, ప్రసాదాల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, దోషులను విచారణ ద్వారా బహిర్గతం చేస్తామని కూటమి నేతలు ముక్తకంఠంతో తీర్మానించారు.అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోని 1వ బ్లాక్ లో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను క్యాబినెట్ తీసుకుంది.

## అసభ్యంగా మాట్లాడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి కానీ, దాడులు చేయడం సరికాదు

ఫిబ్రవరి 03 క్రైమ్ కౌంటర్ న్యూస్): చంద్రబాబు నాయుడుపై తాను చేసిన వ్యాఖ్యల విషయంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు పశ్చాత్తాపం చెందుతున్నారని ఆయన అల్లుడు ఉపేష్ తెలిపారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న అంబటిని సోమవారం మధ్యాహ్నం ఆయన ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు వెలుపల మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.టీడీపీ శ్రేణులే ముందుగా రెచ్చగొట్టేలా ప్రవర్తించారని, ఆ ఒత్తిడిలో అంబటి మాట జారారని ఉపేష్ ఆరోపించారు. సీఎంపై అసభ్యంగా మాట్లాడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి కానీ, దాడులు చేయడం సరికాదన్నారు. అంబటికి సినిమా చూపిస్తామంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు.గుంటూరులోని తమ ఇంటిపై పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త, అనుచరులు కలిసి దాడి చేశారని ఉపేష్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఘటన మొత్తం సీసీటీవీ కెమెరాల్లో నమోదైందని, వాటి ఆధారంగా నిందితులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. "ఏ పార్టీ కూడా ఎల్లప్పుడూ అధికారంలో ఉండదనే విషయం గుర్తుంచుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలే పునరావృతం కావొచ్చు" అని ఆయన హెచ్చరించారు.



# అంబటి ఆఫీసుపై దాడి.. టీడీపీ ఎమ్మెల్యే మాధవిపై కేసు



**క్రైమ్ కౌంటర్ న్యూస్):**గుంటూరు, ఫిబ్రవరి 3సీఎం చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించిన మాజీమంత్రి అంబటి రాంబాబు కార్యాలయంపై దాడిచేసిన ఘటనలో గుంటూరు పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ అలియాస్ ఇసుక బుజ్జితో పాటు మరికొందరిని నిందితులుగా పేర్కొన్నారు. గత నెల 31న పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌లో అంబటి కార్యాలయంపై టీడీపీ శ్రేణులు దాడిచేసి ఫర్నిచర్, కార్యాలయ అద్దాలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్ని ముఖ్యమంత్రి తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి దాడికి పాల్పడిన వారెవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మంగళవారం పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బృందాలు అంబటి ఇల్లు, కార్యాలయాన్ని సందర్శించి దర్యాప్తు చేపట్టాయి. మరోవైపు క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించింది. పట్టాభిపురం పోలీసులు అంబటి భార్య విజయలక్ష్మి, ఆయన కుమార్తెలు మౌనిక, మనోజ్ఞతో పాటు ఆయన పీఏలు ఏలూరి అనిల్ రెడ్డి, మద్దూరి రామకృష్ణ, తాళ్లూరి వెంకటరాయుడులను విచారించి వాంగ్మూలాలు రికార్డు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఇంటిపై దాడిచేసి, అద్దాలు ధ్వంసం చేశారని, దీంతో తాము భయంతో బాత్రూంలో తలదాచుకున్నామని వారు పోలీసులకు వివరించినట్లు తెలిసింది. కాగా.. తన కార్యాలయంపై దాడిలో 31 మంది టీడీపీ నేతలు పాల్గొన్నారని అంబటి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిలో ఎమ్మెల్యేతోపాటు వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు, నేతలు ఉన్నారు. తన ఇల్లు, కార్యాలయంలో ఫర్నిచర్ అద్దాలు, కంప్యూటర్లు, కార్లు ధ్వంసం చేశారని ఆరోపించారు.

# క్వాంటమ్ వ్యాలీ నిర్మాణంలో తొలి అడుగు

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** గుంటూరు, ఫిబ్రవరి 3 సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి మరికొన్ని గంటల్లోనే తొలి అడుగు పడనుంది. ఇటీవలే అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఐకానిక్ భవనం నమూనా ఖరారు కాగా.. ఆ భవనానికి ఈ నెల 6 లేదా 7న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. ఉద్దండ్రాయునిపాలెంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించాలని భావించారు. అయితే నేలపాడులో గురువారం సాగునీటి వినియోగదారుల రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుండటం.. వారం వ్యవధిలో ఆరు కార్యక్రమాల్లో సీఎం పాల్గొనాల్సి ఉండటంతో క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారానికి మార్చాలని భావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఈ అంశంపై వీడియో కాన్ఫరెన్స్ కూడా జరిగింది. అయితే తుది నిర్ణయాన్ని బుధవారం తెలియజేస్తామని సీఎంవో అధికారులు వెల్లడించారు.

**మూడు దశల్లో అభివృద్ధి..**

అమెరికాలో సిలికాన్ వ్యాలీ తరహాలో భారత్‌లోనూ అందునా ఏపీ రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దీనిపై కేంద్రంతో చర్చలు జరిపి ఒక ఎంవోయూ కూడా కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మొత్తం మూడు దశల్లో అమరావతి క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. గతేడాది జూలైలోనే అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్‌ని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన వర్క్‌షాప్ కూడా నిర్వహించింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్‌ని ఇన్‌స్టాల్ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అలాగే.. 2027 జనవరి 1 నాటికి మూడు క్వాంటమ్ కంప్యూటర్లను ఇన్‌స్టాల్ చేయాలని, 2028 జనవరి 1 నాటికి 1,000 నూతన క్వాంటమ్




ఆల్గారిథమ్స్‌ను టెస్టింగ్ చేసే సామర్థ్యానికి చేరుకోవాలని, 2029 జనవరి 1 నాటికి మొత్తం క్వాంటమ్ సామర్థ్యంలో వెయ్యి ప్రభావిత క్యూబిట్స్ లక్ష్యానికి చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో అమరావతి రాజధాని టెక్నాలజీ పరంగా ఉన్నత స్థానంలో నిలుస్తుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**క్వాంటమ్ ప్రోగ్రామ్‌కు లక్ష మంది నమోదు ఉన్నత విద్యామండలి చైర్మన్**

నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) నిర్వహిస్తున్న క్వాంటమ్ ప్రోగ్రామ్ కోసం రాష్ట్రంలోని 1,04,070 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని ఉన్నత విద్యామండలి మంగళవారం రాత్రి తెలిపింది. దేశవ్యాప్తంగా విద్యారంగంలో ఇదొక రికార్డు అని పేర్కొంది. క్వాంటమ్ టెక్నాలజీని విద్యార్థులకు చేరువ చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్ రంగాలు రాబోయే కాలంలో ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పారు.

# అతిపెద్ద 'ప్రకృతి వ్యవసాయ' క్షేత్రంగా ఏపీ



**వచ్చే ఐదేళ్లలో 50 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం.. త్వరలో రాష్ట్రమంతా శిక్షణ తరగతులు**

**ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ.. లంబసింగిలో కుంకుమ పువ్వు సాగుకు ప్రణాళికలు**

**ఇకపై పంటలవారీగా ఫెస్టివల్స్.. వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు**

**క్రైమ్ కౌంటర్ న్యూస్):**అమరావతి, ఫిబ్రవరి 3 రాష్ట్రాన్ని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 18 లక్షల మంది రైతులు 20లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకొచ్చారని, దీనిని సమర్థవంతంగా అమలుచేస్తూ.. 2030–31 నాటికి 40లక్షల మంది రైతులు.. 50లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేలా చూడాలన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'ప్రకృతి సాగుతో వచ్చే ఫలితాలను వ్యవసాయ విద్యార్థులు స్వయంగా తెలుసుకునేలా చేయాలి. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయం కల్పించాలి. సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వంటివి ఏప్రిల్‌కల్లా వచ్చేలా చూడాలి. జూన్ నాటికి రాష్ట్రమంతా పూర్తి కావాలి. సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించాలి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఏపీ వ్యవసాయ ఉత్పత్తుల వాటా అధికంగా ఉండేలా చూడాలి. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు రూపొందించాలి. రాయలసీమలో ఒకప్పుడు నీటి సమస్య ఉండేది. సమర్థ నీటి నిర్వహణతో ఈ ఏడాది ఆ సమస్యను తీర్చాం. అన్ని రిజర్వాయర్ల నింపడంతో పాటు సాగునీటికి లోటు లేకుండా చేశాం' అని చెప్పారు. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కల్టివేషన్, ప్రాసెసింగ్, మార్కెటింగ్.. ఇలా అన్ని అంశాలు అంతర్జాతీయ స్థాయిలో కోకో సిటీలో ఉండాలని స్పష్టంచేశారు. గిరిజనుల భాగస్వామ్యంతో పీపీపీ విధానంలో లంబసింగిలో కుంకుమపువ్వు సాగుకు ముందుకొచ్చే సంస్థలకు అనుమతి ఇవ్వాలన్నారు. పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసేందుకు పాఠశాలలు, అంగన్వాడీలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టు రైతులకే ఇవ్వాలని నిర్దేశించారు.

**విజయవాడలో ఫ్లవర్ మార్కెట్**

విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి సీఎం అంగీకారం తెలిపారు. కుప్పంలో ఫ్లవర్ ఫెస్టివల్ నిర్వహించినట్టే.. మన పంటలకు సంబంధించి, వివిధ ప్రాంతాల్లో ఫెస్టివల్స్ నిర్వహణకు ఆలోచన చేయాలని, దీంతో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. లాజిస్టిక్ ఖర్చు తగ్గించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ విస్తృతం అవుతుందన్నారు. ఫ్రూట్ కవర్లతో మామిడికి మంచి నాణ్యత, ధర వచ్చిందని, జామ, దానిమ్మ వంటి పండ్ల తోటలకు ఈ విధానాన్ని అనుసరించేలా చూడాలని సూచించారు. మార్కెట్ యార్డులున్నచోటే రైతుబజార్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైనచోట రైతుబజార్లను ఆధునీకరించాలని సీఎం సూచించారు. డిజి రైతుబజార్ యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా కూరగాయలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం కలుగుతుంది. ఫార్మ్ మిషనరీ కోసం ఏపీఏఐఎంఎస్ యాప్‌ను, కిసాన్ డ్రోన్ ప్రారంభించారు. రైతులు తమకు అవసరమైన ట్రాక్టర్లు, డ్రోన్లు, గడ్డికోత మిషన్లు, పవర్ టిల్లర్లు బుక్ చేసుకుని, సేవలను పొందవచ్చు. రాష్ట్రంలో 9,512 యంత్ర పరికరాలు సిద్ధంగా ఉంచారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మూడవ వార్షికోత్సవం సందర్భంగా పెద్దమ్మతల్లికి ఘనంగా పూజలు.!!




**పామిడి, ఫిబ్రవరి 03 క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** పామిడి మండలం ఓబులాపురం గ్రామం లో మంగళవారం శ్రీ పెద్దమ్మతల్లి మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు.శ్రీ పెద్దమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ చేసి తీర్థ ప్రసాదం అందజేసి ఆకు పూజ కట్టించి ఓం మంత్రాలు పూజలు నిర్వహించినారు. గ్రామంలో శ్రీ పెద్దమ్మతల్లి మూడవ వార్షికోత్సవం పుట్టినరోజు కార్యక్రమం నిర్వహించారు . పెద్దమ్మ పూజారి రామాంజనేయులు నైట్ కి భజన కార్యక్రమం ఉందని తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది..



**సత్తెనపల్లి నియోజకవర్గం** సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు.ముప్పాళ్ల మండలం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన.బొప్పూడి హనుమంత్ మణికంఠ ప్రసాదరావు గారు. గ్రూప్ 2పరీక్షలో విజయం సాధించి. డిప్యూటీ తాసిల్దారుగా ఎంపికైన సందర్భంగా. శుభాకాంక్షలు తెలియజేసి.భవిష్యత్తులో ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని. సత్కరించిన శాసన సభ్యులు శ్రీ కన్నా లక్ష్మి నారాయణ గారు

# సత్తెనపల్లి పట్టణాభివృద్ధికి ఐదు కోట్లు మంజూరు



పురపాలక శాఖ మంత్రి నారాయణ గారికి కృతజ్ఞతలు తెలిపిన శాసన సభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారు

సత్తెనపల్లి పట్టణ అభివృద్ధికి ఐదు కోట్ల నిధులను పురపాలక శాఖ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సత్తెనపల్లి పట్టణంలో మంత్రి నారాయణ గారి పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులకు ఐదు కోట్లు, పురపాలక సంఘ నూతన కార్యాలయం భవన నిర్మాణానికి మరో రెండు కోట్లు విడుదల చేయాలని శాసన సభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారు కోరారు..

మంత్రి నారాయణ గారు స్పందించి అభివృద్ధి పనులకు ఐదు కోట్ల నిధులు మంజూరు చేశారు.

మంత్రి గారికి, కూటమి ప్రభుత్వానికి శాసన సభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారు కృతజ్ఞతలు తెలిపారు.

# సినిమా



## పారిశుద్ధ్య కార్మికురాలిని ఇంటికి పిలిపించి మరీ గోల్డ్ చైన్ ఇచ్చిన రజనీకాంత్.

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. చెన్నై మహానగర పాలకసంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మను ఇంటికి పిలిచి మరీ సత్కరించారీ సీనియర్ హీరో. ఆమె నిజాయతీని మెచ్చుకోవడంతో పాటు ఒక బంగారు గొలుసును కానుకగా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. పద్మ చెన్నై నగరంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. ఇటీవల ఆమెకు 45 తులాల బంగారం దొరికింది. ప్రస్తుతమన్న మార్కెట్ లో గోల్డ్ రేట్స్ చూసి వేరొకరైతే ఆ బంగారాన్ని తమ వద్దే ఉంచుకునేవారు. కానీ నిజాయతీ గల పద్మ ఆ పని చేయలేదు. తనకు దొరికిన ఆ బంగారాన్ని వెంటనే పోలీసులకు అప్పగించింది. దీంతో ఆమెపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. పద్మ నిజాయతీని మెచ్చుకుంటూ అందరూ ఆమెను మెచ్చుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న తలైవా రజనీకాంత్ కూడా పద్మను ఇంటికి పిలిపించారు. ఆమెతో ఆప్యాయంగా మాట్లాడారు. ఘనంగా సన్మానం చేసి ఒక బంగారపు గొలుసు గిఫ్ట్‌గా అందించారు. సూపర్ స్టార్ స్వయంగా తనను ఇంటికి పిలిపించి సన్మానించడంతో పద్మ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. పద్మతో పాటు ఆమెను ఘనంగా సత్కరించిన రజనీకాంత్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా పద్మ నిజాయతీకి ప్రతీకగా ఆమెకు భారత తపాలా శాఖ ఇటీవలే అరుదైన గౌరవాన్ని అందించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆమెకు రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా అందించింది. ఇక తమిళనాడు ప్రభుత్వం ఆమెను అభినందిస్తూ రూ.లక్ష నగదు బహుమతిని అందించింది





## నిద్ర పట్టడం లేదా? కీళ్లు నొప్పులుగా ఉన్నాయా?

అశ్వగంధ కేవలం ఒక మూలిక మాత్రమే కాదు, అది శరీరంలోని హార్మోన్లను క్రమబద్ధీకరించే ఒక శక్తివంతమైన ఔషధం. ఒత్తిడిని తగ్గించే కార్టిసాల్ నియంత్రణ నుండి, పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచడం వరకు ఇది ఎంతో మేలు చేస్తుంది. దాల్చిన చెక్క, అల్లం, యాలకులు కలిపి తయారు చేసే ఈ టీ రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాల్లోనూ సాటిలేనిది. ఈ అద్భుత టీ తయారీ విధానం దాని వల్ల కలిగే షాకింగ్ హెల్త్ బెనిఫిట్స్ గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

అశ్వగంధ టీ వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు:

రోగనిరోధక శక్తి : చలికాలంలో మారుతున్న సీజన్లలో వచ్చే జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలను ఎదుర్కోవడానికి ఇది శరీరానికి అవసరమైన బలాన్ని ఇస్తుంది.

ఒత్తిడి ఆందోళన: శరీరంలో ఒత్తిడిని కలిగించే 'కార్టిసాల్' హార్మోన్‌ను ఇది అదుపులో ఉంచుతుంది. దీనివల్ల మానసిక ప్రశాంతత చేకూరి, ఆందోళన తగ్గుతుంది.

బరువు నియంత్రణ: అశ్వగంధ టీ శరీర మెటబాలిజంను (జీవక్రియ) వేగవంతం చేస్తుంది. దీనివల్ల కొవ్వు నిల్వలు కరిగి, బరువు తగ్గడం సులభమవుతుంది.

కీళ్ల నొప్పులు: ఇందులోని 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' గుణాలు ఆర్థరైటిస్ మరియు కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. కీళ్లలో దృఢత్వాన్ని తగ్గించి నడకను సులభతరం చేస్తుంది.

మంచి నిద్ర: నిద్రలేమి సమస్యతో బాధపడేవారు ఈ టీని క్రమం తప్పకుండా తీసుకుంటే నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది.

అశ్వగంధ టీ తయారీకి కావలసినవి:

అశ్వగంధ పొడి (అర చెంచా), దాల్చిన చెక్క పొడి, అల్లం తురుము, యాలకులు, తులసి ఆకులు రుచికి తగినంత బెల్లం.

గమనిక: ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. అశ్వగంధ టీని ప్రారంభించే ముందు గర్భిణీలు లేదా ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి.



## పసుపు పాలు తాగుతున్నారా?

భారతీయ ఇళ్లలో రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగడం అనేది ఒక ఆచారం. జలుబు చేసినా, ఒళ్లు నొప్పులుగా ఉన్నా, రోగనిరోధక శక్తి పెంచుకోవాలన్నా మనకు గుర్తొచ్చే మొదటి చిట్కా ఇదే. అయితే మనలో చాలామంది పసుపు పాలు తయారు చేసేటప్పుడు ఒక కీలకమైన పొరపాటు చేస్తున్నారని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ఒక్క తప్పు వల్ల పసుపులోని గుణాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. పసుపులో కర్కుమిన్ అనే అద్భుతమైన పదార్థం ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. మిరియాల్లో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పసుపులోని కర్కుమిన్‌ను శరీరం గ్రహించే శక్తిని ఏకంగా 2,000% పెంచుతుంది. అంటే మీరు మిరియాలు వేయకుండా పసుపు పాలు తాగితే, మీరు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు మీకు అందవు.

కర్కుమిన్ కొవ్వులో కరుగుతుంది. కాబట్టి పాలలో చిటికెడు నెయ్యి లేదా కొబ్బరి నూనె వేస్తే అది వేగంగా శరీరానికి అందుతుంది. తెల్ల చక్కెర ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పసుపు పాలలో సహజమైన తీపి కోసం బెల్లం లేదా తేనె వాడటం మంచిది. ప్యాకెట్ పసుపు కంటే పసుపు కొమ్ములను దంచి వాడితే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రాత్రి పూట పసుపు పాలు తాగడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులను తగ్గించడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. పసుపు పాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పసుపు పాలు ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ.. అతిగా తాగడం వల్ల వేడి చేసే అవకాశం ఉంటుంది. అలాగే గర్భిణీలు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.

## వినాశకాలే విపరీత బుద్ధి..

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ తీసుకున్న మొండి నిర్ణయంపై భారత క్రికెట్ దిగ్గజం, 1983 వరల్డ్ కప్ హీరో కపిల్ దేవ్ నిప్పులు చెరిగారు. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల నష్టపోయేది భారత్ కాదు, పాకిస్థానేనని ఆయన హెచ్చరించారు. ఈ నిర్ణయం పాక్ క్రికెటర్ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

టీ20 వరల్డ్ కప్‌లో భారత్ -- పాక్ మ్యాచ్‌పై జరుగుతున్న రచ్చపై కపిల్ దేవ్ ఘాటుగా స్పందించారు. "మీరు కేవలం ఒక మ్యాచ్‌ను బహిష్కరించడం లేదు, పాకిస్థాన్ క్రికెటర్ల మొత్తం ఒక తరాన్ని నాశనం చేస్తున్నారు" అని ఆయన హెచ్చరించారు. పాకిస్థాన్‌లో అద్భుతమైన టాలెంట్ ఉందని, కానీ బోర్డు తీసుకునే ఇలాంటి రాజకీయ నిర్ణయాల వల్ల యువ ఆటగాళ్ల కెరీర్లు బుడగలా పేలిపోతాయని కపిల్ అన్నారు. రాజకీయాలు, ఈగోల కోసం క్రీడలను బలి చేయడం ఏమాత్రం తగదని సూచించారు.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వైఖరిని తప్పుబడుతూ కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఒక వ్యక్తి అహంకారం దేశం కంటే లేదా ఆట కంటే పెద్దది కాకూడదు. ఆటగాళ్లకు ఆడటం ఇష్టం లేకపోతే వారు నేరుగా చెప్పాలి, అంతే కానీ బోర్డు ఒత్తిడితో ఆడబోమని చెప్పడం దేశ ప్రతిష్టను దిగజార్చడమే" అని పేర్కొన్నారు. పాక్ ఆటగాళ్లు తమ గళాన్ని వినిపించాలని, బోర్డు నిర్ణయాలకు బలి కావొద్దని ఆయన కోరారు.

ఒకవేళ పాకిస్థాన్ భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే, ఐసీసీ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని కపిల్ హెచ్చరించారు. "దీర్ఘకాలంలో పాకిస్థాన్‌ను ఎవరూ మిస్ అవ్వరు. అభిమానులు వేరే మ్యాచ్‌లను చూస్తారు, ప్రపంచం ముందుకు సాగిపోతుంది. కానీ పాకిస్థాన్ మాత్రం అంతర్జాతీయ క్రికెట్‌లో ఏకాకిగా మిగిలిపోతుంది" అని ఆయన విశ్లేషించారు. ఐసీసీ నిబంధనల ప్రకారం ప్రభుత్వ జోక్యం ఉంటే సభ్యత్వం రద్దు చేసే అవకాశం కూడా ఉంటుందని గుర్తు చేశారు.

బంగ్లాదేశ్ జట్టు తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలని కోరినప్పుడు ఐసీసీ తిరస్కరించింది. దీనికి నిరసనగా పాక్ ప్రభుత్వం తమ జట్టు భారత్‌తో ఆడదని ప్రకటించింది. అయితే, ఇప్పటికే భారత్-పాక్ మ్యాచ్ శ్రీలంకలోనే జరుగుతున్నప్పుడు, పాక్ బహిష్కరించడం వెనుక ఎలాంటి తర్కం లేదని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డారు. ఇది కేవలం పాక్ యువ క్రికెటర్ల కలలను సమాధి చేయడమేనని ఆయన కుండబద్దలు కొట్టారు.



## మారిన క్రికెట్ రూల్స్.. బంతి సైజు కూడా

క్రికెట్ నిబంధనలను రూపొందించే అత్యున్నత సంస్థ మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ 2026 ఏడాదికి గానూ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ఆటలో మరింత పారదర్శకత, ఉత్కంఠను పెంచేందుకు టెస్ట్ క్రికెట్‌తో పాటు మహిళల క్రికెట్‌లోనూ కీలక మార్పులు చేస్తూ కొత్త చట్టాలను ప్రకటించింది. ముఖ్యంగా టెస్ట్ మ్యాచ్‌లలో ఆఖరి నిమిషం వరకు డ్రామా కొనసాగేలా ఎంసీసీ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు క్రీడాలోకంలో చర్చనీయాంశంగా మారింది. టెస్ట్ క్రికెట్‌లో ఇప్పటిదాకా ఒక ఆనవాయితీ ఉండేది. అదేంటంటే రోజు ఆట ముగిసే సమయానికి (చివరి ఓవర్లో) ఏదైనా వికెట్ పడితే, వెంటనే ఆ రోజు ఆటను ముగించేసేవారు. దీనివల్ల బ్యాటింగ్ చేసే జట్టుకు ఒక వెసులుబాటు ఉండేది. వారు మరుసటి రోజు ఉదయం తమ వ్యూహానికి తగ్గట్టుగా కొత్త బ్యాటర్‌ను పంపేవారు. కానీ, ఎంసీసీ కొత్త చట్టం 12.5.2 ప్రకారం.. ఇకపై చివరి ఓవర్లో వికెట్ పడినా సరే, ఆ ఓవర్ పూర్తి కావాల్సిందే. అంటే, కొత్త బ్యాటర్ వెంటనే క్రీజులోకి వచ్చి ఆ ఓవర్లో మిగిలిన బంతులను ఎదుర్కోవాలి. దీనివల్ల ఫీల్డింగ్ టీమ్‌కు బ్యాటర్‌పై ఒత్తిడి పెంచే అవకాశం దక్కుతుంది.

మహిళల క్రికెట్‌ను మరింత వేగవంతం చేసేందుకు ఎంసీసీ బంతి బరువు,సైజులో మార్పులు చేసింది. ఇప్పటివరకు మహిళల క్రికెట్‌లో బంతి బరువు 140 నుండి 151 గ్రాముల మధ్య ఉండేది. ఇప్పుడు దాన్ని 140 నుండి 149 గ్రాములకు తగ్గించారు. అలాగే బంతి పరిమాణం కూడా 21.5 నుండి 22 సెంటీమీటర్లుగా నిర్ణయించారు. దీనివల్ల బౌలర్లు మరింత వేగంతో బంతులు విసరడానికి, అలాగే బ్యాటర్లు భారీ షాట్లు కొట్టడానికి వీలవుతుందని భావిస్తున్నారు.

కేవలం అంతర్జాతీయ క్రికెట్ మాత్రమే కాకుండా, పునాది స్థాయి క్రికెట్‌లోనూ మార్పులు తెచ్చారు. అండర్-13 జూనియర్ క్రికెట్‌లో వాడే బంతి బరువును 140-144 గ్రాములుగా స్థిరీకరించారు. దీని సైజు కూడా 20.5 నుంచి 21 సెంటీమీటర్ల మధ్య ఉండేలా నిబంధనలు మార్చారు. వర్ధమాన క్రీడాకారులు సరైన బరువున్న బంతితో ప్రాక్టీస్ చేయడం వల్ల భవిష్యత్తులో వారు సీనియర్ లెవల్‌కు వెళ్ళినప్పుడు ఇబ్బంది పడకుండా ఉంటారని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయి?

ఈ కొత్త నిబంధనలు 2026 జనవరి నుంచి ప్రపంచవ్యాప్తంగా జరిగే అన్ని అధికారిక క్రికెట్ మ్యాచ్‌లకు వర్తిస్తాయి. దీనివల్ల టెస్ట్ క్రికెట్‌లో ఆఖరి ఓవర్లలో వికెట్ పడితే వచ్చే ఉత్కంఠ మరింత పెరుగుతుంది. ముఖ్యంగా డ్రా అయ్యే స్థితిలో ఉన్న మ్యాచ్‌లలో ఈ రూల్ గేమ్ ఛేంజర్‌గా మారే అవకాశం ఉంది. ఎంసీసీ తీసుకున్న ఈ చారిత్రక నిర్ణయం పట్ల మాజీ క్రికెటర్లు మరియు విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.